తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 01- సెప్టెంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 89 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# చారిత్రాత్మక సంస్కరణలతో
# కొత్త అధ్యాయం

## విధ్వంసం నుంచి వికాసం వైపు తెలంగాణ: సీఎం



రైతులు, మహిళలు, యువతకు భారీ సంక్షేమం
కులగణన, ఎస్సీ వర్గీకరణలో చారిత్రాత్మక నిర్ణయాలు
అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ప్రతిపక్షాలపై విమర్శలు
వెయ్యి రోజుల పాలన విజయాలను వివరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**

విధ్వంసానికి గురైన తెలంగాణ రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించేందుకు గత వెయ్యి రోజుల ప్రజా ప్రభుత్వ పాలనలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ నదిపై ముసారాంబాగ్ వద్ద నిర్మించిన ఎత్తైన వంతెన ప్రారంభోత్సవం సందర్భంగా అంబర్‌పేటలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమంతో పాటు కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి కీలక సామాజిక అంశాల్లో దూరదృష్టితో కూడిన నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని రూపాయి రూపాయి కూడబెట్టి కష్టాల బాట నుంచి అభివృద్ధి మార్గంలోకి తీసుకొచ్చామని, అభివృద్ధి కార్యక్రమాలను చూసి కొందరు ఓర్వలేక అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చామని ముఖ్యమంత్రి వివరించారు.

మిగతా 2లో



## భూభారతితో భూ సమస్యలకు
## పరిష్కారం

780 మంది రైతులకు భూ ఆధార్‌తో పట్టాదార్ పాస్‌బుక్కుల పంపిణీ
దశాబ్దాల వివాదాలకు రీ-సర్వేతో శాశ్వత పరిష్కారమన్న మంత్రి
నిర్లక్ష్య అధికారులపై కఠిన చర్యల హెచ్చరిక
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**మహబూబాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్రంలో రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న దశాబ్దాల భూ సమస్యలను భూభారతి రీ-సర్వే ద్వారా పరిష్కరిస్తూ వారికి భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురంలో సుమారు 60 ఏళ్లుగా పరిష్కారం కాని అసైన్డ్ భూముల సమస్యకు

మిగతా 2లో

## ఆలంపూర్ అభివృద్ధికి
## కేంద్రం ప్రాధాన్యత

- శక్తిపీఠం అభివృద్ధికి భారీ నిధులు
- రైల్వే స్టేషన్ పనులు 95 శాతం పూర్తి
- పెండింగ్ మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలి
- భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

7లో



## కృష్ణా జలాల అంశంలో రేవంత్‌పై హరీశ్ ఫైర్

**వెలిగొండ ద్వారా నీటి తరలింపుపై అభ్యంతరం**
**తెలంగాణ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న ఆరోపణ**
**కేఆర్ఎంబీ వైఖరిపై తీవ్ర విమర్శలు**
**కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్**



**హైదరాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**
వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను బేసిన్ దాటి తరలిస్తోందని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం తెలంగాణకు తీరని ద్రోహమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ఆరోపించారు. నీటి కేటాయింపులు లేకున్నా, వరద జలాల పరిస్థితి లేకున్నా ఏపీ ప్రభుత్వం యథేచ్ఛగా కృష్ణా జలాలను వినియోగిస్తోందని ఆయన విమర్శించారు. తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళనకరమని హరీశ్ రావు పేర్కొన్నారు. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు అవసరమైన నీరు అందక రైతులు ఇబ్బందులు

మిగతా 2లో

## బహుజన తెలంగాణే లక్ష్యం: కవిత

### నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ

- కొత్త రాజకీయ ప్రత్యామ్నాయంపై పిలుపు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలపై విమర్శలు

**నిజామాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిజామాబాద్ ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో పాల్గొన్న పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, బంగారు తెలంగాణ కంటే బహుజన తెలంగాణ అవసరమని పేర్కొన్నారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకురావడమే తన లక్ష్యమని, పదవుల కోసం కాకుండా ప్రజల కోసం కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించానని చెప్పారు. తెలంగాణ ఉద్యమం కోసం వేలాది మంది యువత ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేసిన ఆమె, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సాధారణ ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పులు రాలేదని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ ప్రజలు తనకు ఎప్పుడూ అండగా నిలిచారని, ఎంపీగా, ఎమ్మెల్సీగా అవకాశాలు ఇచ్చా ర ని గుర్తు చేసుకుంటూ, ఇప్పుడు మరోసారి ప్రజల ఆశీర్వాదం కోరుతూ ముందుకు వస్తున్నానని తెలిపారు.

తనపై జరిగిన రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, ఎలాంటి తప్పు చేయకుండానే జైలుకు పంపించారని, నాలుగేళ్లపాటు దర్యాప్తు సంస్థల ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ ధైర్యం కోల్పోలేదని కవిత అన్నారు.

మిగతా 2లో



## ప్రభుత్వ ఆస్పత్రుల్లో
## ఐవీఎఫ్ సేవల విస్తరణకు చర్యలు

- ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను జిల్లాలకు విస్తరించాలి
- ఏఆర్టీ, సరోగసి చట్టాల అమలుపై కఠిన పర్యవేక్షణ
- నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాలపై చర్యలు తప్పవు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

7లో



## ప్రజాపాలన వెయ్యి రోజుల
## విజయగాథ

- రైతు సంక్షేమానికి పెద్దపీట
- యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు
- సామాజిక న్యాయంలో కీలక నిర్ణయాలు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

2లో





## జర్మన్ పరిశ్రమలతో భాగస్వామ్యానికి తెలంగాణ కృషి

- జీబీఏ ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ
- సెమీకండక్టర్లు, అధునాతన తయారీ రంగాల్లో పెట్టుబడులపై చర్చ
- తెలంగాణ–జర్మనీ లాజిస్టిక్స్ కారిడార్ ప్రతిపాదన పరిశీలన

7లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

# చారిత్రాత్మక సంస్కరణలతో కొత్త అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని, ఒప్పంద, బయటి సేవల ఉద్యోగులకు కూడా అదే విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న పదవీ విరమణ ప్రయోజనాల్లో వేల కోట్ల రూపాయలను ఇప్పటికే చెల్లించామని చెప్పారు. ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించి ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య భద్రత కల్పించామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న రవాణా సంస్థ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఇచ్చి అండగా నిలిచామని గుర్తుచేశారు.

విద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం కీలక అడుగులు వేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగులకు అవకాశాలు కల్పించేందుకు గత రెండేళ్లలో వేలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి దేశంలోనే అత్యధిక నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో భారీ స్థాయిలో నియామకాలు చేపట్టి యువతకు ఉపాధి అవకాశాలు




కల్పించినట్లు వివరించారు.

రైతుల సంక్షేమానికి వెయ్యి రోజుల పాలనలో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతుల పంట కొనుగోళ్ల కోసం భారీ మొత్తాలను చెల్లించామని, పెట్టుబడి సాయాన్ని అందించామని చెప్పారు. లక్షలాది మంది రైతులకు రుణమాఫీ చేశామని, ఉచిత విద్యుత్ కోసం కూడా భారీగా నిధులు ఖర్చు చేశామని వెల్లడించారు. సన్న వడ్లకు ప్రోత్సాహకాన్ని అందించామని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

మహిళల సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేశామని, స్వయం సహాయక సంఘాలకు భారీ స్థాయిలో రుణ సదుపాయాలు కల్పించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి దాని కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చించామని వెల్లడించారు. ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం సరఫరా వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది ఇళ్లు, నగర ప్రాంతాల్లో పేదల కోసం బహుళ అంతస్తుల గృహ నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించామని వివరించారు.

సామాజిక న్యాయం, మౌలిక సదుపాయాలు, భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని, శతాబ్దం తర్వాత కులగణన నిర్వహించామని తెలిపారు. వివిధ రంగాల అభివృద్ధికి కొత్త విధానాలు తీసుకొచ్చామని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ మొత్తాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. గత పాలనలో దెబ్బతిన్న తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, ఈ ప్రయాణంలో ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# కృష్ణా జలాల అంశంలో రేవంత్‌పై హరీశ్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కొంటుండగా, మరోవైపు బేసిన్‌కు సంబంధం లేని ప్రాంతాలకు నీటిని తరలించడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టుల కింద ఆయకట్టులు నీటి కొరతతో ఎండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడి కాల్వల తర్వాత ఇప్పుడు వెలిగొండ ద్వారా కూడా నీటి తరలింపు కొనసాగుతోందని ఆరోపించారు. తెలంగాణకు దక్కాల్సిన వాటా నీటిని రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు విమర్శించారు. పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల రైతాంగ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని, రాష్ట్ర రైతుల అవసరాల కంటే ఏపీ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోందని అన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) కూడా ప్రేక్షకపాత్ర పోషిస్తోందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను పరిరక్షించాల్సిన సంస్థలు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడం లేదని ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపడంతో పాటు ఆయకట్టులకు సాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ తరపున కోరారు.





# బహుజన తెలంగాణే లక్ష్యం: కవిత

(మొదటి పేజీ తరువాయి)

సొంత ఊరికి వచ్చినప్పుడు భావోద్వేగానికి గురయ్యానని చెప్పినా, తాను పిరికివాళ్లలో కాదని స్పష్టం చేశారు. తనకు అండగా నిలిచిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కవిత, వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతు భరోసా, పెన్షన్లు, మహిళలకు ఆర్థిక సహాయం వంటి కీలక హామీలు అమలు కాలేదని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడాల్సిన ప్రతిపక్షం కూడా మౌనంగా ఉండటం ఆశ్చర్యకరమని, ప్రజా సమస్యలపై ప్రశ్నించని నాయకత్వాన్ని ప్రజలు గమనించాలని అన్నారు.

బీఆర్ఎస్ నాయకత్వంపై కూడా విమర్శలు గుప్పించిన కవిత, కొందరు నేతలు ప్రజల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాలో పలువురు నాయకుల తీరును ప్రస్తావిస్తూ, తన రాజకీయ జీవితంలో ఎదురైన అనుభవాలను సభలో వివరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, నిజామాబాద్ జిల్లాలో ఐదు స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యమని ప్రకటించారు. పాంచజన్య సంకల్ప సభ ద్వారా ఐదు ప్రధాన అంశాలతో ముందుకు వెళ్తున్నామని కవిత వెల్లడించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు పరిమల స్థాపనకు రుణాలు, సామాజిక న్యాయం, భూమిలేని పేదలకు భూమి పంపిణీ వంటి అంశాలను ప్రధాన లక్ష్యాలుగా ప్రకటించారు. తెలంగాణలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం నిజమైన పురోగతి సాధిస్తుందని పేర్కొంటూ, బహుజన తెలంగాణ నిర్మాణానికి ప్రజల మద్దతు కోరారు.



# భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం



(మొదటి పేజీ తరువాయి)

భూభారతి ద్వారా పరిష్కారం చూపించి 780 మంది రైతులకు 1,378 ఎకరాలకు సంబంధించిన భూ ఆధార్‌తో కూడిన పట్టాదార్ పాస్‌బుక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో 125 ఏళ్ల క్రితం జరిగిన భూ సర్వే తర్వాత సమగ్ర సర్వే జరగలేదని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వ హయాంలోనూ భూముల సమగ్ర సర్వేపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని చెప్పారు.

ధరణి స్థానంలో భూ యజమానులకు అండగా నిలిచేలా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని, రాష్ట్రాన్ని భూ వివాదాలు లేని తెలంగాణగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో కూడిన పట్టాదార్ పాస్‌బుక్కులను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల తుంగతుర్తిలో 13 గ్రామాలకు చెందిన రైతులకు 3,400 ఎకరాల భూములకు పట్టాలు అందించగా, ఇప్పుడు నారాయణపురంలో 780 మంది రైతులకు పాస్‌బుక్కులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నారాయణపురంలో తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న సుమారు 150 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించిన సమస్యను కూడా త్వరలో పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మారుమూల ప్రాంతాలకు సైతం సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి అర్హుడికి న్యాయం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.

అనంతరం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెవెన్యూ, హౌసింగ్ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితా, భూ సమస్యలు తదితర అంశాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రజా ప్రతినిధుల సమీక్షా సమావేశాలకు గైర్హాజరవుతున్న తహసీల్దార్లు, ఎంఆర్వోలపై కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ సంస్కరణలు ప్రజలకు చేరేలా సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజాపాలన వెయ్యి రోజుల విజయగాథ

హైదరాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు): ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం గర్వకారణమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజాపాలనలో 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, ఉపాధి కల్పన వంటి రంగాల్లో ప్రభుత్వం సాధించిన పురోగతి ప్రజాపాలన విజయానికి నిదర్శనమని అన్నారు. రైతుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25.35 లక్షల మంది రైతులకు రుణ విముక్తి కల్పించినట్లు చెప్పారు. రైతు భరోసా సాయాన్ని ఎకరానికి రూ.12 వేల వరకు పెంచి రైతులకు ఆర్థిక భరోసా అందించామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్ల బోనస్ వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు తీసుకొచ్చామని వెల్లడించారు.

వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం వెయ్యి రోజుల కాలంలో రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసి రికార్డు సృష్టించినట్లు ఆయన తెలిపారు. రుణమాఫీ కోసం రూ.20 వేల కోట్లకు పైగా, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. రైతు బీమా కోసం రూ.3,500 కోట్లు వెచ్చించడంతో పాటు సన్నవడ్ల బోనస్ కోసం దాదాపు రూ.4 వేల కోట్లు కేటాయించడం ద్వారా రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటుకున్నామని అన్నారు. సామాన్య ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండగా, రూ.500కే ఎల్పీజీ సిలిండర్ పంపిణీ ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు. 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి పేదలకు ఆహార భద్రత కల్పించామని, మొత్తం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు.

తెలంగాణ యువతలో విశ్వాసాన్ని పెంపొందించేలా 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని ఆయన తెలిపారు. యువత నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడంతో పాటు ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించడంతో పాటు 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. సామాజిక న్యాయ సాధనలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీసీ కులగణన నిర్వహించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడంతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, వ్యవసాయ కూలీలు, బలహీన వర్గాలను ప్రభుత్వ విధానాల కేంద్రబిందువుగా మార్చామని, రాహుల్ గాంధీ సూచించిన సామాజిక న్యాయ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణలో పలు కీలక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

## అధ్వానంగా పెద్దమందడి-వనపర్తి రహదారి

-- ప్రజల ఇబ్బందులపై ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతిపత్రం

**పెద్దమందడి,ఆగస్టు31(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి నుంచి వనపర్తి వరకు ఉన్న రహదారి చాలా రోజులుగా గుంతలమయంగా మారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ పెద్దమందడి మండలం బీఆర్ఎస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.ఈ రహదారిపై నిత్యం విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడటంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందన్నారు.ప్రతిపక్ష పార్టీగా ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, పెద్దమందడి-వనపర్తి రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి, గుంతలను పూడ్చి నాణ్యమైన రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నాయకులు కోరారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## వనపర్తి–పెద్దమందడి మధ్య ఆర్టీసీ బస్సులు నడపాలి



- వనపర్తి డీఎంతో ఫోన్ ఇన్ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు

**వనపర్తి,ఆగస్టు31(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి నుంచి పెద్దమందడి మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఫోన్ ఇన్ కార్యక్రమంలో వనపర్తి ఆర్టీసీ డిఎం దేవేందర్ గౌడ్ తో ఫోన్ లో మాట్లాడిన విఆర్ఎస్ నేతలు పెద్దమందడి మండల ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను వివరించారు.పెద్దమందడి మండల కేంద్రానికి నిత్యం వనపర్తి నుంచి ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని, సరైన బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నేతలు తెలిపారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వనపర్తి-పెద్దమందడి మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపించాలని వారు డీఎంను కోరారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

## పెద్దమందడి ప్రజావాణికి 8 దరఖాస్తులు



**పెద్దమందడి,ఆగస్టు31(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 8 దరఖాస్తులు వచ్చినట్లు పెద్దమందడి ఎంపీడీవో పరిణత, తహసిల్దార్ మల్లికార్జున్ తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో పరిణత, ఎస్సై జలంధర్ రెడ్డి, మండల విద్యాధికారి మంజులత, ఏపిఎం సకుర్ నాయక్, విద్యుత్ శాఖ అధికారి, వైద్య సిబ్బంది, వివిధ శాఖలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోపాల్పూర్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీలు





**ఎల్కతుర్తి ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని గోపాల్పూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. మండల ఎంఎస్పీ అధ్యక్షుడు కె. రాజేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి జూపాక మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి ఎల్తూరి వినయ్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా నమిండ్ల నరేష్, ఉపాధ్యక్షుడిగా ఎల్తూరి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా అజయ్ ఎన్నికయ్యారు. అలాగే ఎంఎస్పీ గ్రామ అధ్యక్షుడిగా మంద అనిల్ను ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు నమిండ్ల నరేష్ మాట్లాడుతూ.. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకలాపాలను బలోపేతం చేస్తామని తెలిపారు. అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఐక్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. తమను ఎన్నుకున్న నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వెలుగొండకు నికర జలాలు తరలిస్తే సహించం

- రేవంత్ సర్కార్ వైఖరిపై మాజీ మంత్రి నిరంజన్రెడ్డి ఆగ్రహం



**వనపర్తి,ఆగస్టు31(తెలంగాణ ముచ్చట్లు):** వెలుగొండ ప్రాజెక్టుకు కేవలం కృష్ణా వరద జలాలను మాత్రమే వినియోగించాల్సి ఉండగా, నికర జలాలను తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోకపోవడం దురదృష్టకరమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్రెడ్డి విమర్శించారు. తెలంగాణ సాగునీటి విషయంలో కాంగ్రెస్ది మొదటి నుంచీ వ్యతిరేక వైఖరేనని ఆరోపించారు.జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్రెడ్డి, చిట్టెం రామ్మోహన్రెడ్డితో కలిసి ఆంధ్రప్రదేశ్ జలచర్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలుగొండ ప్రాజెక్టు పేరుతో కృష్ణా నికర జలాలను తరలిస్తే తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. తెలంగాణకు, పాలమూరు ప్రాంతానికి ప్రధాన శత్రువు కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు.

పాలమూరురంగారెడ్డిపై నిరంజన్రెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర సొంత నిధులతో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి 2023 నాటికి దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశామని నిరంజన్రెడ్డి తెలిపారు. పంపింగ్ స్టేషన్లు, రిజర్వాయర్లు, టన్నెళ్లు, భూసేకరణ వంటి కీలక పనులు పూర్తిచేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనుల్లో ఆశించిన పురోగతి లేదని ఆరోపించారు.పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే పాలమూరు జిల్లాకు భారీగా సాగునీరు అందే అవకాశం ఉందని, ప్రాజెక్టు ఆలస్యం వల్ల ఆంధ్రప్రదేశ్కు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. జూరాలకు వరద వచ్చిన సమయంలోనూ నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టలేదని విమర్శించారు.

ఎస్ ఎల్ బి సి పనులపైనా విమర్శలు

శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ ఎల్ బి సి) పనుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో సొరంగ పనుల్లో కొంత భాగాన్ని పూర్తి చేశామని, ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని డిమాండ్ చేశారు.అవగాహన లేకుండా, నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని నిరంజన్రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ నీటి హక్కుల కోసం తాము ఎన్నో ఏళ్లుగా పోరాడామని, పాలమూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి

- పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా
- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి,ఆగస్టు31(తెలంగాణ ముచ్చట్లు):** పేదల వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.45,31,100 విలువైన 150 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 1 నాటికి వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకోనుందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ వర్తించని వారికి చికిత్స అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.వనపర్తి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా మానవతా దృక్పథంతో అర్హులైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నందిమల్ల యాదయ్య, రాజేంద్రప్రసాద్ యాదవ్, అక్తర్, దేవన్న యాదవ్, చంద్రశేఖర్, నాగార్జున, ఆవుల చంద్రశేఖర్, గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనా వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**ఖమ్మం బ్యూరో , ఆగస్టు, 31(తెలంగాణ ముచ్చట్లు):** అధికార కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వైఫల్యలపై సెప్టెంబర్ 2 నుంచి వారం రోజులపాటు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ వనమా వెంకటేశ్వర రావు అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని 420 హామీలు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. వెయ్యి రోజులు గడుస్తున్నా కూడా నేటికీ ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పాలన వైఫల్యం పై బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా సమర శంఖం పూరించిందన్నారు. వారం రోజుల పాటు పలు అంశాలపై ప్రతిరోజూ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. సెప్టెంబర్ 2న నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. వ్యవసాయ రంగానికి సాగు నీరు విడుదల చేయకుండా, 24 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వకుండా, యూరియా సరఫరాలో వైఫల్యాలపై 3వ తేదీన నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. వృద్ధులు, వికలాంగులకు నాలుగు వేల పింఛన్, మహిళలకు రెండు వేల పింఛను ఇవ్వకుండా మోసం చేసిందుకు నిరసనగా 4వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో వంటా వార్పు కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని అన్నారు. విద్యార్థులు, యువకులకు విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని మోసపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వైఖరిని ఎండ గడుతూ 5వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీ లు నిర్వహించాలని సూచించారు. తెలంగాణ కేతల మాణికమైన సింగరేణి బొగ్గు గనులను కాంగ్రెస్ అనుయాయులకు దోపిడీ కేంద్రాలుగా మార్చినందుకు నిరసన సదస్సులు, గ్రామ పంచాయతీల్లో పడకేసిన పారిశుద్యంపై, నిధులు లేక నీరసించిన పాలనపై ఆరో తేదీన నిరసన కార్యక్రమాలు రూపొందించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాల ప్రకారం ప్రజలకు రావాల్సిన బాకీలపై 7వ తేదీన జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే ప్రజావాణిలో వినతి పత్రాలు సమర్పించాలన్నారు. చివరిగా కాంగ్రెస్ మోసాలను ఎండగడుతూ.. 8 వ తేదీన అంబేద్కర్ గారి విగ్రహాలకు వినతి పత్రాల అందజేయాలని ఎంపీ రవిచంద్ర పార్టీ షెడ్యూల్ వివరించారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు మాట్లడుతూ.. అడ్డగోలు హామీలిచ్చి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజలు తొందరలోనే గ్రహించారని, రాబోయే రోజులు ఆ పార్టీకి సమాధి కట్టడం ఖాయమని అన్నారు. పార్టీ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమాల్లో అన్నిచోట్ల పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, కార్పొరేటర్లు వేల్పుల దామోదర్, భీమా శ్రీధర్, మల్లొత్రా సాగర్, మంతపురి రాజు గౌడ్, మల్లెల రవిచంద్ర, గోవాడ గుణ చరిత్, గుగులోత్ రాంబాబు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు పూసల విశ్వనాధం, మల్లెల శ్రీరామమూర్తి, కొట్టి వెంకటేశ్వర్లు, లావుడ్యా సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు రుక్మాంగధర్, వేముల ప్రసాద్ బాబు, అంబుల వేణు, మాజీ ఎంపీపీ లు బాదావత్ శాంతి, భూక్యా సోన, నాయకులు ముద్దంగుల మహేష్, ఏమునరి శివ, కరాటే శ్రీను, టీబీజీకేఎస్ నాయకులు కాపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వెల్టూర్ శివాలయానికి హెచ్పీ మోటార్ విరాళం

- మాధవరెడ్డి–శాంతమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస్రెడ్డి సేవాభావం

**పెద్దమందడి,ఆగస్టు31(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని శ్రీ సిద్ధి రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ సంపు కోసం సీఆర్ఐ 1 హెచ్పీ మోటార్ను కీర్తిశేషులు మాధవరెడ్డి, శాంతమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస్రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు విరాళంగా అందజేశారు.ఆలయ అవసరాల కోసం మోటార్ను విరాళంగా అందించిన శ్రీనివాస్రెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు ఎం. శివకుమార్ స్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కోసం దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు.శ్రీ సిద్ధి రామలింగేశ్వర స్వామి వారి సంపూర్ణ అనుగ్రహం శ్రీనివాస్రెడ్డి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అర్చకులు శివకుమార్ స్వామి ఆకాంక్షించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# రాజ్యాధికార పార్టీలోకి వందలాది మంది చేరికలు





- **ప్రతి గ్రామానికి పార్టీని తీసుకెళ్తా: తిరగమల్ల నాగార్జున**

**హుజురాబాద్,ఆగష్టు 31(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మండలం రంగాపూర్, కాట్రపల్లి గ్రామాల్లో తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన వందలాది మంది ప్రజలు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. తీన్మార్ మల్లన్న సమక్షంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండల పార్టీ అధ్యక్షుడిగా తిరగమల్ల నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల రాజును తీన్మార్ మల్లన్న నియమించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన తిరగమల్ల నాగార్జున తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించినందుకు మల్లన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

హుజురాబాద్ మండలంలోని ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు తెలంగాణ రాజ్యాధికార పార్టీని తీసుకెళ్తానని నాగార్జున స్పష్టం చేశారు. పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువచ్చే వరకు తీన్మార్ మల్లన్న అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులతో కలిసి నిరంతరం పనిచేస్తానన్నారు.

తన నియామకానికి సహకరించిన కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణక్క, జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, కొత్తపల్లి మండల అధ్యక్షురాలు ఓర్సు విమల, వేణులకు నాగార్జున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో బొడ్డు సురేష్, బొడ్డు దేవదాసు, బొడ్డు శ్రీనివాస్, బొడ్డు సుమన్, బొడ్డు శ్రీను, మైస కుమారస్వామి, మైస శ్రీనివాస్, వేల్పుల శ్రీనివాస్, మైస సంపత్, మైస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి





- **కౌశిక్ రెడ్డి–సుహాసిని చేతుల మీదుగా కుట్టు మిషన్ల పంపిణీ**

**హుజురాబాద్,ఆగష్టు 31(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి వర్గం సంక్షేమానికి కృషి చేస్తోందని హుజురాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని అన్నారు. ఇందులో భాగంగా మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలో మైనారిటీ మహిళలకు 250 కుట్టు మిషన్లను ఉచితంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా మైనారిటీలకు ఈ పథకం ద్వారా కుట్టు మిషన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. వీటి ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.రానున్న రోజుల్లో మైనారిటీలకు మరిన్ని సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కుట్టు మిషన్ల పంపిణీకి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అజారుద్దీన్, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్చార్జి వొడితల ప్రణవ్‌కు నియోజకవర్గ మైనారిటీల పక్షాన సుహాసిని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్డీఓ జలకుమారి, ఎమ్మార్వో నరేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట విజయవంతం చేయండి

- **మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 31(తెలంగాణ ముచ్చట్లు):** పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 2వ తేదీ నాటికి వెయ్యి రోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన కార్యాచరణలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న పోరుబాట నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని నామ విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు మద్దతు ధర, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు, పేదలకు



ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, యూరియా కొరత, పంటల కొనుగోళ్లలో ఇబ్బందులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, మహిళలకు ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలను నిరసన కార్యక్రమాల ద్వారా ప్రజల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మందగించాయని నామ పేర్కొన్నారు. సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు పార్టీ ప్రకటించిన కార్యాచరణ ప్రకారం వివిధ స్థాయిల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 2న తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై చార్జిషీట్ కార్యక్రమం, అలాగే నియోజకవర్గ కేంద్రాల్లో ఆరు గ్యారంటీలపై వైఫల్యాలను ఎండగట్టడం, 3న వ్యవసాయ విధ్వంసంపై నిరసన, 22A నిషేధిత భూముల కోసం అర్బన్ ఏరియాల్లో ధర్నాలు, 4న వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సదస్సులు, మహిళలకు రూ.2,500, కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వని ప్రభుత్వానికి నిరసనగా వంటావార్పు, 5న విద్యార్థులు, యువతకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ కోసం నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ 6న పల్లెల విధ్వంసం, పడకేసిన పారిశుధ్యంపై నిరసనగా గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు, 7న ప్రజావాణిలో జిల్లా, మండల కేంద్రాల్లో 420 హామీల అమలుపై వినతిపత్రాలు ఇవ్వాలని, 8న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, ప్రెస్‌మీట్, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నామ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేలా పార్టీ శ్రేణులు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల స్థాయిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నామ కోరారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- **కలెక్టర్ ప్రియాంక విద్యార్థినులకు సూచన**
- **గురుకుల పాఠశాల సందర్శన**

**నారాయణపేట, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణతో నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద ఉన్న గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించిన ఆమె ఇంటర్మీడియట్ విద్యార్థినులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల అభిరుచులు, భవిష్యత్ లక్ష్యాలు, విద్యా ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా వైద్య విద్యను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థినులు నీట్ పరీక్షకు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో సిద్ధం కావాలని తెలిపారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా అధ్యయనం చేయడంతో పాటు పునశ్చరణ, నమూనా పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థినులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. లక్ష్య సాధనలో ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమయపాలన కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసంపైనా దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో అందుతున్న విద్యా సదుపాయాలు, వసతి, భోజన ఏర్పాట్లపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థినులు తమ సందేహాలను కలెక్టర్‌తో పంచుకోగా, ఆమె వాటికి సమాధానాలు ఇస్తూ ప్రోత్సాహకరమైన సూచనలు చేశారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేస్తే తప్పకుండా విజయాన్ని అందుకోవచ్చని చెప్పారు. ప్రతి విద్యార్థిని తన సామ




ర్థ్యాలను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా గురుకుల విద్యార్థినులతో ముచ్చటించి వారి భవిష్యత్ ప్రణాళికల గురించి తెలుసుకోవడం పట్ల విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యలను నేరుగా చెప్పుకునే అవకాశం లభించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థినుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

## రాజేంద్రప్రసాద్ యాదవ్‌ను సన్మానించిన చిన్నారెడ్డి



**వనపర్తి,ఆగస్టు31(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తిలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షులుగా నియమితులైన రాజేంద్రప్రసాద్ యాదవ్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం రాజీవ్ గాంధీ గొప్ప ఆలోచన అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పనిచేసే వారికి అధిష్ఠానం గుర్తింపు ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రాజేంద్రప్రసాద్ యాదవ్ కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి గౌడ్ కుటుంబానికి శుభాకాంక్షలు



- **వధూవరులకు బీసీ నేతల ఆశీస్సులు**

**హనుమకొండ,ఆగష్టు 31(తెలంగాణ ముచ్చట్లు ):** బీసీ ఆజాది ఫెడరేషన్ హుజురాబాద్ డివిజన్ అధ్యక్షులు పంజాల తిరుపతి గౌడ్ కుమారుని నిశ్చితార్థ వేడుకలు హనుమకొండలోని ఎర్రగట్టు గుట్ట సమీపంలోని మిత్ర ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుడికాల భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జినుకల లక్ష్మణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకమరి శ్రీనివాస్ తదితర నాయకులు హాజరయ్యారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించి, పంజాల తిరుపతి గౌడ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు

## మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



- **పలువురు మహిళా వక్తల పిలుపు**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 31(తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు తమలోని సామర్థ్యాన్ని గమనించి, ఆత్మవిశ్వాసంతముందుకు సాగాలని పలువురు మహిళా వక్తలు పిలుపునిచ్చారు. జమాతే ఇస్లామీ హింద్ సౌత్ శాఖ అధ్యక్షురాలు నాజియా తబ్బాసుమ్ అధ్యక్షతన జరిగిన మహిళా విద్యావేత్తల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మహిళా భక్తులు పాల్గొని ప్రసంగించారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఖమ్మం అధ్యక్షురాలు అజిత, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ సమ్రిన్, జాగృతి ఎన్జీవో మెంబర్ మాధవి, స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్, మెంటర్ సల్మా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ వివిధ రంగాలలో పనిచేస్తున్న మహిళల మధ్య అనుభవాల మార్పిడి, పరస్పర సహకారం, సమన్వయం ద్వారా మరిన్ని సామాజిక కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. మహిళలను ప్రేరేపించడం నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వారి సామర్థ్యాలను సమాజ శ్రేయస్సుకు వినియోగించడం ద్వారా బలమైన,బాధ్యతాయుతమైన, అభివృద్ధి చెందిన సమాజా నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్, జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం పిఆర్ కన్వీనర్ హాజీరా మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త (స అసం) జీవితం మనందరికీ మార్గదర్శకమని, ఆయన ప్రజల పట్ల ఎంతో జాలి, కరుణ, ఆదరణ చూపించే వారని, ఆయన నోటి ద్వారా చేతల ద్వారా ఎప్పుడు ఏ ఒకరికి ఇబ్బంది కలిగించలేదని, మనం కూడా ఆయనను ఆదర్శంగా తీసుకొని మన జీవితాలను చక్కదిద్దుకోవాలని పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త ఒక కొడుకుగా, ఒక తండ్రిగా, ఒక సోదరుడుగా, ఆదర్శ దైవదాసుడిగా, గొప్ప పరిపాలకుడి గా, ఒక స్నేహితుడిగా, ఆయన ఆదర్శ జీవితం, జీవిత చరిత్ర తెలుసుకొని, ఆచరించవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆయన ఆదర్శ భోధనాలు పాటిస్తే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సోదర భావం వెలసిల్లుతాయని తెలిపారు. కార్యక్రమంలో నార్త్ మహిళ విభాగం అధ్యక్షురాలు హుస్సేన్ బి, నసీమా, సురయ్య, అప్సర్, సాజీదా, మదిహ, రేష్మ, షాకిరా, మహిళా విద్యావేత్తలు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 22 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ



**వరంగల్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 22 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా కారణాలతో తక్షణమే అమల్లోకి వచ్చేలా బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బదిలీల్లో భాగంగా ఎస్. శ్రీనివాస్‌ను గణపురం ఎస్‌హెచ్‌ఓగా, జి. వేణును రఘునాథపల్లి సర్కిల్ సీఐగా, ఎ. శ్రీనివాస్‌ను వరంగల్ సీఎస్‌బీకి, పి. దేవేందర్‌ను నర్మెట్ట సర్కిల్ సీఐగా నియమించారు.అలాగే టి. రవి కుమార్‌ను వరంగల్ డబ్ల్యూపీఎస్II ఎస్‌హెచ్‌ఓగా, ఎ. సువర్ణను వరంగల్ సీసీఎస్‌కు, పి. మంగీలాల్‌ను టాస్క్‌ఫోర్స్‌కు, భరత్ సుమన్‌ను పాలకుర్తి సర్కిల్ సీఐగా, వి. జానకీ రామ్‌రెడ్డిని వరంగల్ సీఎస్‌బీకి, టి. కిరణ్‌ను పీసీఆర్‌కు బదిలీ చేశారు. ఎ. ప్రవీణ్ కుమార్‌ను పరకాల ఎస్‌హెచ్‌ఓగా, వి. క్రాంతి కుమార్‌ను వరంగల్ టాస్క్‌ఫోర్స్‌కు, అనుముల శ్రీనివాస్‌ను ధర్మసాగర్ ఎస్‌హెచ్‌ఓగా, జి. బాబులాల్‌ను ఆత్మకూరు ఎస్‌హెచ్‌ఓగా నియమించారు.ఇక ఆర్. సంతోష్‌ను పర్వతగిరి సర్కిల్ సీఐగా, బి. రాజగోపాల్‌ను టాస్క్‌ఫోర్స్‌కు, కె. శ్రీనును ఎల్కతుర్తి సీఐగా, పి. రమేష్‌ను హనుమకొండ డబ్ల్యూపీఎస్I ఎస్‌హెచ్‌ఓగా, కె. సూర్య ప్రసాద్‌ను సీటీసీ వరంగల్‌కు, కె. సాయి రమణను వరంగల్ సీఎస్‌బీకి బదిలీ చేశారు.

వై. సంజీవరావును వర్ధన్నపేట సీఐగా, కె. శ్రీనివాసరావును వరంగల్ సీసీఆర్‌బీకి నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన అధికారులు వెంటనే రిలీవ్ అయి, కొత్త పోస్టింగ్‌లలో విధుల్లో చేరాలని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆదేశించారు. సంబంధిత ఏసీపీలు ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో సూచించారు.

# ఈజిప్టు అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో భారత వైమానిక దళం



- **ఎల్ అలమైన్ చేరుకున్న 'సారంగ్' బృందం**
- **ధ్రువ్ హెలికాప్టర్లతో విన్యాసాలకు సిద్ధం**
- **భారత్–ఈజిప్టు రక్షణ సంబంధాలకు మరింత బలం**

**ఎల్ అలమైన్ (ఈజిప్టు), ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** భారత వైమానిక దళానికి చెందిన సారంగ్ హెలికాప్టర్ ప్రదర్శన బృందం ఈజిప్టులోని ఎల్ అలమైన్ నగరానికి చేరుకుంది. సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు జరగనున్న రెండో ఎల్ అలమైన్ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో ఈ బృందం పాల్గొననుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సారంగ్ బృందం తన అద్భుతమైన గగన విన్యాసాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. స్వదేశీ సాంకేతికతతో రూపుదిద్దుకుని తయారైన అధునాతన తేలికపాటి ధ్రువ్ హెలికాప్టర్లను ఉపయోగిస్తూ సారంగ్ బృందం ప్రదర్శనలు ఇవ్వనుంది. కచ్చితత్వం, సమన్వయం, అత్యున్నత స్థాయి విమాన నైపుణ్యాలను ప్రతిబింబించే విన్యాసాలతో భారత వైమానిక దళ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటనుంది. ప్రపంచంలో హెలికాప్టర్లతో ప్రత్యేక వైమానిక విన్యాసాలు చేసే ఏకైక బృందంగా సారంగ్ ప్రత్యేక గుర్తింపు పొందింది. గగనతలంలో అత్యంత క్లిష్టమైన విన్యాసాలను సమన్వయంతో ప్రదర్శించే ఈ బృందం అనేక అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనల్లో ప్రశంసలు అందుకుంది. ఈసారి ఎల్ అలమైన్ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో పాల్గొనడం ద్వారా భారత రక్షణ రంగ సామర్థ్యాలను ప్రపంచ వేదికపై మరోసారి ప్రదర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. సారంగ్ బృందం ప్రదర్శనలు భారత్‌లో అభివృద్ధి చెందిన వైమానిక సాంకేతికతకు ప్రతీకగా నిలవనున్నాయి. ఈ ప్రదర్శన భారత్-ఈజిప్టు మధ్య పెరుగుతున్న రక్షణ, వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలకు మరింత బలం చేకూర్చనుందని భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు జరిగే ఈ వైమానిక ప్రదర్శనలో వివిధ దేశాలకు చెందిన విమానాలు, హెలికాప్టర్లు పాల్గొననున్నాయి. వాటిలో భారత వైమానిక దళ సారంగ్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా, ధ్రువ్ హెలికాప్టర్లతో చేసే విన్యాసాల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# సోన్ నది జలాలపై వివాదానికి ముగింపు

- **బిహార్–ఝార్ఖండ్ మధ్య కీలక ఒప్పందం**
- **అమిత్ షా సమక్షంలో ఎంఓయూ సంతకాలు**
- **లక్షలాది రైతులకు సాగునీటి ప్రయోజనం**
- **తాగునీటి సరఫరాకు ఊతం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** తూర్పు భారతదేశంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సోన్ నది జలాల పంపిణీ వివాదానికి కీలక పరిష్కారం లభించింది. కేంద్ర హోంమంత్రి, సహకార శాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల మధ్య సోన్ నది జలాల భాగస్వామ్యానికి సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ద్వారా రెండు రాష్ట్రాల మధ్య ఉన్న దీర్ఘకాలిక జల వివాదానికి తెరపడిందని అమిత్ షా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా, బిహార్ మరియు ఝార్ఖండ్ రాష్ట్రాలు పరస్పర అవగాహనతో ముందుకు వచ్చి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయని అన్నారు. తూర్పు భారతదేశ అభివృద్ధికి నీటి వనరుల సమర్థ వినియోగం ఎంతో అవసరమని, ఈ ఒప్పందం ఆ దిశగా కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. సోన్ నది జలాల భాగస్వామ్యంపై కుదిరిన ఈ ఒప్పందం వల్ల బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని విస్తారమైన గ్రామీణ ప్రాంతాలకు సాగునీటి సదుపాయం మెరుగుపడనుంది. ముఖ్యంగా లక్షలాది మంది రైతులు వ్యవసాయానికి అవసరమైన నీటిని పొందడంతో పంటల ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రజలకు తాగునీటి సరఫరా కూడా మెరుగుపడుతుందని కేంద్ర హోంమంత్రి వెల్లడించారు. నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ఈ ఒప్పందం ద్వారా స్థిరమైన నీటి వనరులు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ఈ ఒప్పందాన్ని అమలు చేయనున్నాయి. నీటి పంపిణీ, వినియోగం, నిర్వహణ అంశాల్లో సమన్వయంతో పనిచేసి ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. సోన్ నది జలాల ఒప్పందం దేశంలో అంతర్రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి ఆదర్శంగా నిలుస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. పరస్పర చర్చలు, సహకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ ఒప్పందం బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించనున్నదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# పుతిన్‌తో విస్తృత చర్చలు జరిపిన ప్రధాని మోదీ

- **భారత్–రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యంపై సమీక్ష**
- **ఇంధనం, అంతరిక్షం సహా కీలక రంగాలపై దృష్టి**
- **ద్వైపాక్షిక సంబంధాల మరింత బలోపేతానికి కట్టుబాటు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**భారత్-రష్యా ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలపై ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో సహకారాన్ని విస్తరించే అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా భారత్-రష్యా ప్రత్యేక, ప్రాధాన్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా సమీక్షించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. గత కొన్నేళ్లుగా ఇరు దేశాల మధ్య వివిధ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించడం సంతోషకరమని పేర్కొన్నారు.

భారత్-రష్యా స్నేహబంధంలో ఇంధన రంగం కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని చెప్పారు. ఇంధన భద్రత, సాంకేతిక ఆవిష్కరణలు, అంతరిక్ష పరిశోధనలు, ఎరువుల ఉత్పత్తి, సరఫరా వంటి రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు. ప్రజల మధ్య పరస్పర సంబంధాలను మరింత విస్తరించడంపై కూడా చర్చలు జరిగినట్లు వెల్లడించారు. విద్య, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల ద్వారా ఇరు దేశాల ప్రజల మధ్య అనుబంధాన్ని మరింత పెంచాలని అభిప్రాయపడ్డారు.

భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు అంతర్జాతీయ వేదికలపై కూడా కీలకంగా ఉన్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక, భద్రతా అంశాల్లో పరస్పర సహకారం ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తోందని పేర్కొంటున్నారు. ఇటీవలి కాలంలో ఇంధనం, సాంకేతికత, అంతరిక్షం, వ్యవసాయ రంగాల్లో సహకారం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ప్రధాని మోదీ-అధ్యక్షుడు పుతిన్ చర్చలు ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊతమిస్తాయని భావిస్తున్నారు.



# దక్షిణ కమాండ్ సన్నద్ధతపై సమీక్ష

- **ఆపరేషనల్ సిద్ధతపై సైన్యాధిపతి ఆరా**
- **యుద్ధ సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి**
- **సాంకేతికత వినియోగంపై కీలక సూచనలు**
- **భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా ఉండాలని పిలుపు**



**పుణె, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** భారత సైన్యాధిపతి జనరల్ దిలీప్ సింగ్ షేత్ దక్షిణ కమాండ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి కమాండ్ ఆపరేషనల్ సిద్ధత, యుద్ధ సామర్థ్యాల పెంపు చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ ప్రస్తుత భద్రతా పరిస్థితులు, సైనిక సన్నద్ధత, శిక్షణ కార్యక్రమాలు, యుద్ధ సామర్థ్యాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై సైన్యాధిపతికి వివరించారు. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా సైన్యం ఎప్పటికప్పుడు తన వ్యూహాలను, కార్యాచరణ విధానాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని జనరల్ దిలీప్ సింగ్ షేత్ పేర్కొన్నారు. ఆపరేషనల్ సిద్ధతను నిరంతరం కొనసాగించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా స్వీకరించడం, ఆధునిక యుద్ధ అవసరాలకు అనుగుణంగా టెక్నిక్స్, టాక్టిక్స్ అండ్ ప్రొసీజర్స్ (టిటిపీలు)ను నవీకరించడం కీలకమని సూచించారు.

వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉండే శిక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. భూసేన, నౌకాదళం, వైమానిక దళం మధ్య మరింత సమన్వయం పెంపొందించడం ద్వారా సమగ్ర యుద్ధ సామర్థ్యాలను బలోపేతం చేయాలని సూచించారు. అలాగే స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, ఆయుధ వ్యవస్థల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. భవిష్యత్ యుద్ధ సవాళ్లను ఎదుర్కొనేందుకు సాంకేతికంగా బలోపేతమైన, వేగంగా స్పందించే సైన్యాన్ని నిర్మించడమే లక్ష్యమని సైన్యాధిపతి స్పష్టం చేశారు. ఇందుకోసం ఆధునిక సాంకేతికతల వినియోగం, డేటా ఆధారిత వ్యవస్థల అభివృద్ధి, నెట్‌వర్క్ కేంద్రిత యుద్ధ సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. దక్షిణ కమాండ్ పరిధిలోని సైనికులు, అధికారులు చూపుతున్న వృత్తి నైపుణ్యం, అంకితభావాన్ని జనరల్ దిలీప్ సింగ్ షేత్ అభినందించారు. దేశ భద్రత కోసం వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొంటూ, ఎల్లప్పుడూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశ రక్షణలో దక్షిణ కమాండ్ కీలక పాత్ర పోషిస్తోందని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యుద్ధ సామర్థ్యాలను మరింత పెంపొందిస్తూ ఆపరేషనల్ ఆధిక్యాన్ని కొనసాగించాలని సైన్యాధిపతి పిలుపునిచ్చారు. కమాండ్‌లో చేపడుతున్న ఆధునికీకరణ చర్యలు భారత సైన్యాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దడంలో కీలకంగా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# లక్షద్వీప్‌లో మత్స్య రంగానికి కొత్త దిశ

- **ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా కార్యాచరణ ప్రణాళిక ఆవిష్కరణ**
- **అలంకార చేపల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక**
- **సముద్ర సంపద వినియోగంపై దృష్టి**
- **నీలి విప్లవంలో మరో కీలక అడుగు**

**అగట్టి (లక్షద్వీప్), ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** లక్షద్వీప్‌లో నిర్వహించిన మత్స్యశాఖ అవగాహన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పాల్గొని అలంకార చేపల అభివృద్ధి కోసం రూపొందించిన "మిషన్ రంగీన్ మఛ్లీ-2031" వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్షద్వీప్ అభివృద్ధి చరిత్రలో ఇది ఒక చారిత్రక రోజుగా నిలిచిపోతుందని, భారత నీలి విప్లవానికి ఇది మరో ముఖ్యమైన మైలురాయిగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. లక్షద్వీప్‌కు అపారమైన సముద్ర వనరులు ఉన్నాయని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఈ దీవుల్లో లక్ష టన్నులకు పైగా మత్స్య సంపద సామర్థ్యం ఉందని, అందులో సుమారు 94 వేల టన్నుల ట్యూనా మరియు ట్యూనా తరహా చేపల ఉత్పత్తి అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే స్థానిక ప్రజలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. అలంకార చేపల పెంపకం, సంరక్షణ, మార్కెటింగ్‌కు సంబంధించిన సమగ్ర కార్యాచరణతో "మిషన్ రంగీన్ మఛ్లీ-2031" రూపొందించబడిందని అధికారులు తెలిపారు. ఈ ప్రణాళిక ద్వారా మత్స్యకారులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడంతో పాటు ఎగుమతుల అవకాశాలను కూడా విస్తరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖతో పాటు పంచాయతీరాజ్ శాఖల సహకారంతో మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో లక్షద్వీప్ కీలక పాత్ర పోషించగలదని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, లక్షద్వీప్, దమన్ అండ్ డయ్యూ పరిపాలకుడు ప్రఫుల్ కె. పటేల్, కేంద్ర సహాయ మంత్రి ఎస్.పీ. సింగ్ బఘేల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మత్స్య రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వారు వివరించారు. లక్షద్వీప్‌లో మత్స్య రంగానికి ఆధునిక సాంకేతికత, మౌలిక సదుపాయాలు, మార్కెట్ అనుసంధానం కల్పించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# కదిలే బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం

- దేశ రాజధానిని కుదిపేసిన దారుణ ఘటన
- 16 ఏళ్ల విద్యార్థినిపై డ్రైవర్, కండక్టర్ అఘాయిత్యం
- 45 నిమిషాల పాటు బస్సులోనే నరకయాతన
- నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ రాజధాని ఢిల్లీలో మహిళల భద్రతపై మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసే ఘటన వెలుగుచూసింది. 16 ఏళ్ల విద్యార్థినిపై కదులుతున్న ప్రైవేట్ స్లీపర్ బస్సులో డ్రైవర్, కండక్టర్ సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఆగస్టు 4న జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. బాధితురాలు ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురి జిల్లాకు చెందినదిగా పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులతో గొడవ పడిన అనంతరం బాలిక నోయిడాలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయల్దేరింది. ఈ క్రమంలో గ్రేటర్ నోయిడాలోని పరిచౌక్ వద్ద ఢిల్లీ వైపు వెళ్తున్న ప్రైవేట్ స్లీపర్ బస్సును ఎక్కింది. బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పరిస్థితిని ఆసరాగా చేసుకున్న డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్ ఆమెపై దారుణానికి ఒడిగట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.
పరిచౌక్ నుంచి ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వరకు సుమారు 45 నిమిషాల పాటు బస్సును రోడ్డుపై తిప్పుతూ నిందితులు బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం బాధితురాలిని కశ్మీరీ గేట్ బస్ స్టాండ్ వద్ద దింపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనతో తీవ్ర మానసిక వేదనకు గురైన బాలిక అనంతరం తన కుటుంబ సభ్యులను సంప్రదించి జరిగిన విషయాన్ని వివరించింది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి బస్సు మార్గం, సీసీ కెమెరా దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. దర్యాప్తులో నిందితుల వివరాలు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.
ఈ ఘటనపై మహిళా సంఘాలు, బాలల హక్కుల సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థల్లో భద్రతా లోపాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యంగా మైనర్ బాలికపై జరిగిన ఈ దారుణం సమాజాన్ని కలచివేస్తోందని పేర్కొంటున్నాయి. ఢిల్లీలో నిర్భయ ఘటన తర్వాత మహిళల భద్రత కోసం అనేక చర్యలు చేపట్టినప్పటికీ ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం ఆందోళనకరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేసును అత్యంత ప్రాధాన్యంతో విచారిస్తున్నామని, బాధితురాలికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. నిందితులపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# పోషకాహార లోపం లేని భారతం సాధ్యమేనా?


**డెస్క్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. అంతరిక్ష పరిశోధనల నుంచి డిజిటల్ విప్లవం వరకు అనేక రంగాల్లో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న భారత్, ఆహార ఉత్పత్తిలోనూ అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచింది. అయినప్పటికీ పోషకాహార లోపం అనే సమస్య ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. దేశంలోని అనేక ప్రాంతాల్లో చిన్నారుల ఎదుగుదల లోపాలు, మహిళల్లో రక్తహీనత, గర్భిణుల్లో పోషకాహార సమస్యలు, పేద కుటుంబాల్లో సమతుల ఆహారం అందకపోవడం వంటి పరిస్థితులు కనిపిస్తూనే ఉన్నాయి. ఒకవైపు ఆహార ధాన్యాల నిల్వలు పెరుగుతుంటే, మరోవైపు లక్షలాది మంది అవసరమైన పోషకాలు లేక ఇబ్బందులు పడటం ఆందోళన కలిగించే అంశం. అందుకే పోషకాహార లోపం లేని భారతం సాధ్యమేనా అనే ప్రశ్న కేవలం ఆరోగ్య రంగానికే పరిమితం కాకుండా దేశ అభివృద్ధికి సంబంధించిన కీలక చర్చగా మారింది. పోషకాహార లోపం అంటే చాలామంది కేవలం ఆకలితో ఉండటమేనని భావిస్తారు. కానీ వాస్తవానికి ఇది మరింత విస్తృతమైన సమస్య. కడుపు నిండా ఆహారం తీసుకున్నప్పటికీ శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు, సూక్ష్మ పోషకాలు తగిన మోతాదులో అందకపోతే కూడా పోషకాహార లోపం ఏర్పడుతుంది. ప్రస్తుతం దేశంలో అనేక కుటుంబాలు బియ్యం, గోధుమలు వంటి ప్రాథమిక ఆహార పదార్థాలను తీసుకుంటున్నప్పటికీ, సమతుల ఆహారం విషయంలో వెనుకబడుతున్నాయి. పాలు, గుడ్లు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు వంటి పోషకాహార పదార్థాల వినియోగం అనేక ప్రాంతాల్లో తక్కువగానే ఉంది. దీంతో పిల్లల శారీరక ఎదుగుదల మాత్రమే కాదు, మానసిక వికాసం, విద్యాసామర్థ్యం, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై కూడా ప్రభావం పడుతోంది. పోషకాహారం లోపించడం అనేది వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా దేశ మానవ వనరుల నాణ్యతను ప్రభావితం చేసే అంశంగా మారుతోంది. చిన్నారుల ఆరోగ్యంపై పోషకాహార ప్రభావం అత్యంత కీలకంగా ఉంటుంది. జీవితంలోని తొలి వెయ్యి రోజులు ఒక శిశువు భవిష్యత్తును నిర్ణయించే కాలంగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సమయంలో సరైన పోషకాహారం అందకపోతే ఎదుగుదలలో లోపాలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. బాల్యంలో ఏర్పడిన పోషకాహార లోపం ప్రభావం జీవితాంతం కొనసాగవచ్చు. శారీరక ఎదుగుదల మందగించడం, చదువులో వెనుకబడటం, రోగనిరోధక శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే గర్భిణి ఆరోగ్యం నుంచి శిశువు పుట్టిన తర్వాతి సంరక్షణ వరకు ప్రతి దశలో పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆరోగ్యవంతమైన చిన్నారులే రేపటి ఆరోగ్యవంతమైన భారతాన్ని నిర్మిస్తారనే విషయాన్ని మరవకూడదు. మహిళల ఆరోగ్యం కూడా పోషకాహార పరిస్థితిని అంచనా వేయడంలో కీలక సూచికగా నిలుస్తుంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళలు ఇప్పటికీ రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. కుటుంబంలో అందరికీ ఆహారం పెట్టిన తర్వాత మిగిలింది తినే పరిస్థితి చాలాచోట్ల కనిపిస్తోంది. గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోకపోతే అది తల్లి ఆరోగ్యానికే కాకుండా శిశువు ఎదుగుదలపైనా ప్రభావం చూపుతుంది. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచకుండా దేశ పోషకాహార పరిస్థితిని మెరుగుపరచడం సాధ్యం కాదు. అందుకే మహిళలకు పోషకాహారంపై అవగాహన పెంచడం, వారికి ప్రత్యేక ఆరోగ్య సేవలు అందించడం, కుటుంబ స్థాయిలో వారి ఆహార అవసరాలను గుర్తించడం అత్యంత అవసరం. ప్రభుత్వాలు పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. పోషణ్ అభియాన్, అంగన్‌వాడీ సేవలు, మధ్యాహ్న భోజన పథకం, గర్భిణులు మరియు బాలింతల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు ఈ దిశగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం లక్షలాది మంది విద్యార్థులకు పౌష్టికాహార వనరుగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార సేవలు అందుతున్నాయి. అయితే పథకాల అమలు సమర్థవంతంగా జరగడం, అవినీతి లేకుండా లబ్ధిదారులకు ప్రయోజనాలు చేరడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించడం వంటి అంశాలపై మరింత శ్రద్ధ అవసరం. భారతదేశం ప్రస్తుతం "ద్వంద్వ పోషకాహార సవాలు"ను ఎదుర్కొంటోంది. ఒకవైపు పోషకాహార లోపం ఉండగా, మరోవైపు స్థూలకాయం, మధుమేహం, గుండె జబ్బులు వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగం పెరగడం వల్ల పోషక విలువలు తక్కువగా ఉండే ఆహారం ఎక్కువగా తీసుకుంటున్నారు. దీంతో కడుపు నిండుతున్నా శరీరానికి అవసరమైన పోషకాలు అందడం లేదు. ఇది ఒక కొత్త తరహా పోషకాహార సమస్యగా మారుతోంది. కాబట్టి భవిష్యత్తులో ఆహార భద్రత మాత్రమే కాకుండా పోషక భద్రతపై కూడా సమానంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మన సంప్రదాయ ఆహార విధానాల్లో పోషకాహారానికి సంబంధించిన అనేక మంచి అంశాలు ఉన్నాయి. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, స్థానిక పండ్లు, ఆకుకూరలు, సహజ ఆహార పదార్థాలు ఒకప్పుడు భారతీయుల దైనందిన జీవితంలో భాగంగా ఉండేవి. ఆధునిక జీవనశైలి కారణంగా ఇవి క్రమంగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం ప్రపంచం మళ్లీ మిల్లెట్లు, సహజ ఆహారాల వైపు దృష్టి సారిస్తున్న సమయంలో భారత్ కూడా తన సంప్రదాయ ఆహార సంస్కృతిని పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉంది. స్థానికంగా లభించే పోషకాహార వనరులను ప్రోత్సహించడం ద్వారా తక్కువ ఖర్చుతోనే పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చు. పోషకాహార సమస్య పరిష్కారంలో అవగాహన అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. చాలా కుటుంబాలు సరైన ఆహారం అంటే ఏమిటి, పిల్లలకు ఏ వయస్సులో ఎలాంటి ఆహారం ఇవ్వాలి, గర్భిణులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి వంటి విషయాలపై పూర్తి సమాచారం లేక ఇబ్బందులు పడుతున్నాయి. ఆరోగ్య శాఖలు, విద్యాసంస్థలు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో పోషకాహార విద్యను విస్తృతంగా ప్రచారం చేయాలి. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు పోషకాహారం ప్రాముఖ్యతను బోధిస్తే భవిష్యత్తులో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చు. పోషకాహార లోపాన్ని నిర్మూలించడం అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. కుటుంబాలు, సమాజం, విద్యాసంస్థలు, వైద్య నిపుణులు, మీడియా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రతి కుటుంబం తమ పిల్లల ఆహారంపై శ్రద్ధ చూపాలి. స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలను వినియోగించాలి. మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సమాజంలో ఎవరూ ఆకలితో లేదా పోషకాహార లోపంతో బాధపడకుండా చూడడం ఒక సామాజిక బాధ్యతగా భావించాలి. పోషకాహార లోపం లేని భారతం అనేది అసాధ్యమైన కల కాదు. సరైన విధానాలు, సమర్థవంతమైన అమలు, ప్రజల్లో అవగాహన, పోషకాహారంపై సామూహిక చైతన్యం ఉంటే ఆ లక్ష్యాన్ని ఖచ్చితంగా సాధించవచ్చు. దేశ అభివృద్ధిని కేవలం ఆర్థిక వృద్ధితో కాకుండా ప్రజల ఆరోగ్యంతో కూడా కొలవాల్సిన సమయం వచ్చింది. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఎదిగినప్పుడు, ప్రతి మహిళ రక్తహీనత నుంచి బయటపడినప్పుడు, ప్రతి కుటుంబం సమతుల ఆహారం పొందినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. పోషకాహార లోపం లేని భారతం ఒక స్వప్నం కాదు; సంకల్పంతో, సమిష్టి కృషితో సాధించగల జాతీయ లక్ష్యం.



# మానసిక ఆరోగ్య చైతన్యానికి సెప్టెంబర్ ప్రత్యేకం

- ఆత్మహత్యల నివారణపై నెలరోజుల అవగాహన కార్యక్రమాలు
- మానసిక సమస్యలపై మాట్లాడేందుకు ప్రోత్సాహం
- సహాయం కోరడం ధైర్యానికి నిదర్శనమనే సందేశం

**డెస్క్ ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలను సూసైడ్ ప్రివెన్షన్ అవేర్‌నెస్ మంత్ గా పాటిస్తారు. మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం, ఆత్మహత్యలకు దారితీసే కారణాలను గుర్తించడం, ప్రమాదంలో ఉన్న వ్యక్తులకు సకాలంలో సహాయం అందించడం ఈ అవగాహన మాసం ప్రధాన లక్ష్యాలు. వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక సమస్యల కారణంగా మానసిక ఒత్తిడికి గురవుతున్న వారిని ఆదుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. మానసిక ఆరోగ్యాన్ని కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా పరిగణించాల్సిన అవసరాన్ని ఈ నెల గుర్తుచేస్తుంది.
ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఆత్మహత్యలు ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారాయి. ముఖ్యంగా యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిళ్లు, విద్యా భారం, ఉద్యోగ అనిశ్చితి, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, ఒంటరితనం వంటి అంశాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన మద్దతు అందిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకే సెప్టెంబర్ నెలలో సమస్యలపై బహిరంగ చర్చలు జరిపేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న చాలా మంది తమ బాధలను ఇతరులతో పంచుకోవడానికి వెనుకాడుతుంటారు. సమాజంలో ఇంకా ఉన్న అపోహలు, విమర్శల భయం, అవగాహన లోపం కారణంగా చాలామంది మౌనంగా బాధపడుతుంటారు. ఫలితంగా వారి పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో నిరాశ, ఆందోళన, నిద్రలేమి, జీవితంపై ఆసక్తి కోల్పోవడం, ఒంటరిగా ఉండాలని కోరుకోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మానసిక సమస్యలు కూడా చికిత్స ద్వారా అధిగమించగల ఆరోగ్య సమస్యలేనని ఈ అవగాహన మాసం స్పష్టం చేస్తోంది.
సెప్టెంబర్ నెలలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యాసంస్థలు, కార్యాలయాలు, ఆసుపత్రులు, సామాజిక సంస్థలు కలిసి సదస్సులు, వర్క్‌షాప్‌లు, కౌన్సెలింగ్ శిబిరాలు, ర్యాలీలు, సామాజిక మాధ్యమ ప్రచారాలను నిర్వహిస్తాయి. మానసిక ఆరోగ్యం గురించి ప్రజలకు సరైన సమాచారం అందించడం, సహాయం అవసరమైన వారికి అందుబాటులో ఉన్న సేవల గురించి తెలియజేయడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం. యువతలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులు ఆత్మహత్యల నివారణలో కీలక పాత్ర పోషించగలరని నిపుణులు పేర్కొంటున్నారు. ఒక వ్యక్తి ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా స్పందించడం అవసరం. నిరాశ, నిస్పృహ, భవిష్యత్తుపై ఆశలు కోల్పోవడం వంటి సంకేతాలను గుర్తించి వారికి అండగా నిలిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చు. ముఖ్యంగా వినే మనస్తత్వం, సహనం, మానవీయ దృక్పథం అనేక సందర్భాల్లో ఒక ప్రాణాన్ని కాపాడగలవని మానసిక ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.
విద్యార్థులు మరియు యువత ప్రస్తుతం అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న వర్గాలలో ఒకటిగా గుర్తించబడుతున్నారు. పరీక్షల ఒత్తిడి, ఉద్యోగ పోటీ, కెరీర్‌పై ఆందోళనలు, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. విజయాలు మాత్రమే జీవితానికి కొలమానం కాదని, అపజయాలు కూడా జీవితంలో భాగమేనని యువతకు అర్థమయ్యేలా చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. మానసిక స్థైర్యం పెంపొందించే కార్యక్రమాలు ఈ అవగాహన మాసంలో ప్రధానంగా నిర్వహిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన నేటి కాలంలో మానసిక ఆరోగ్య సేవలు కూడా ప్రజలకు మరింత చేరువవుతున్నాయి. ఆన్‌లైన్ కౌన్సెలింగ్, హెల్ప్‌లైన్ సేవలు, మానసిక ఆరోగ్య యాప్‌లు ద్వారా అవసరమైన వారికి తక్షణ సహాయం అందుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మానసిక ఆరోగ్య సేవలను విస్తరించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. అయితే సేవలు అందుబాటులో ఉండటంతో పాటు వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కూడా అంతే ముఖ్యమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని కూడా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ఆత్మహత్యల నివారణకు అవసరమైన చర్యలపై చర్చిస్తారు. ప్రభుత్వాలు, ఆరోగ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఆత్మహత్యల నివారణ అనేది కేవలం ఆరోగ్య రంగ బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అంశమని ఈ కార్యక్రమాలు తెలియజేస్తాయి. మానసిక ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టడం అనేది సమాజ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడమేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఆరోగ్యవంతమైన మనస్సు ఉన్నప్పుడే వ్యక్తి తన సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోగలడు. కుటుంబాలు, విద్యాసంస్థలు, కార్యాలయాలు మానసిక ఆరోగ్యానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తే అనేక సమస్యలను ముందుగానే నివారించవచ్చు. మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు సామాజిక, ఆర్థిక రంగాలపై కూడా ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
సూసైడ్ ప్రివెన్షన్ అవేర్‌నెస్ మంత్ సమాజానికి ఒక కీలక సందేశాన్ని అందిస్తోంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆశను కోల్పోకూడదని, సమస్యలకు పరిష్కార మార్గాలు ఎప్పుడూ ఉంటాయని, అవసరమైతే సహాయం కోరడం తప్పు కాదని ఈ అవగాహన కార్యక్రమాలు గుర్తుచేస్తున్నాయి. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించి, ప్రతి ఒక్కరూ తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే వాతావరణాన్ని నిర్మించడం ద్వారా మాత్రమే ఆత్మహత్యల సంఖ్యను తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. "మాట్లాడండి, వినండి, అండగా నిలవండి" అనే సందేశంతో సెప్టెంబర్ నెల ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య చైతన్యానికి వేదికగా నిలుస్తోంది.



# ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐవీఎఫ్ సేవల విస్తరణకు చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను మరింత విస్తరించడంతో పాటు ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లలో ఏఆర్టీ, సరోగసి చట్టాల అమలును కట్టుదిట్టం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే కేంద్రాలపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఫర్టిలిటీ కేంద్రాల పనితీరు, ఏఆర్టీ, సరోగసి చట్టాల అమలు, పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గాంధీ ఆస్పత్రి, పేట్లబుర్జు ఆస్పత్రిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఐవీఎఫ్ కేంద్రాల పనితీరును మంత్రి సమీక్షించారు. ఈ రెండు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 39,802 మంది రోగులకు ఫర్టిలిటీ సేవలు అందించినట్లు అధికారులు వివరించారు. 20,185 ఫాలిక్యులర్ స్టడీలు, 521 ఐయూఐ ప్రక్రియలు, 545 ఐవీఎఫ్ కేసులు నిర్వహించినట్లు తెలిపారు. సంతానం కోసం ఎదురుచూస్తున్న అనేక మంది దంపతులకు ఈ కేంద్రాలు ఆశాకిరణంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో 2024 అక్టోబర్‌లో, పేట్లబుర్జులోని ఎంజీఎంహెచ్‌లో 2024 డిసెంబర్‌లో ఐవీఎఫ్ కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు జిల్లాల్లోనూ దశలవారీగా ఐవీఎఫ్ కేంద్రాలను విస్తరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన సంతానోత్పత్తి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 477 ఏఆర్టీ, సరోగసి కేంద్రాలు నమోదు అయ్యాయని అధికారులు తెలిపారు. వీటిలో 129 ఏఆర్టీ లెవల్ 1 కేంద్రాలు, 226 ఏఆర్టీ లెవల్ 2 కేంద్రాలు, 59 ఏఆర్టీ బ్యాంకులు, 63 సరోగసి క్లినిక్‌లు ఉన్నాయని వివరించారు. చట్టాల ప్రకారం అన్ని కేంద్రాలు పనిచేస్తున్నాయా లేదా అనే అంశంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని మంత్రి సూచించారు. సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ, గ్రీవెన్స్ సెల్ పనితీరును క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ ఫర్టిలిటీ కేంద్రాలపై నిర్వహించిన తనిఖీల్లో 379 కేంద్రాలను పరిశీలించగా 50 కేంద్రాల్లో వివిధ రకాల నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. సిబ్బంది మార్పులు, రికార్డుల నిర్వహణలో లోపాలు, రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాల ప్రదర్శన లేకపోవడం, గ్రీవెన్స్ సెల్ నిర్వహించకపోవడం, అనుమతించిన చిరునామా కాకుండా ఇతర ప్రాంతాల్లో కేంద్రాలు నిర్వహించడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. రెండు కేంద్రాల రిజిస్ట్రేషన్లు రద్దు చేయగా, తొమ్మిది కేంద్రాల అనుమతులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వివరించారు.

పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో 2,600 తనిఖీలు నిర్వహించగా 52 కేంద్రాల్లో 37 ఉల్లంఘనలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, ప్రభుత్వ రంగంలో ఫర్టిలిటీ సేవలను విస్తరించడంతో పాటు ప్రైవేట్ రంగంలో నాణ్యత, పారదర్శకత, చట్టబద్ధతను నిర్ధారించేలా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.



## ఆలంపూర్ అభివృద్ధికి
# కేంద్రం ప్రాధాన్యత

**ఆలంపూర్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**

జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం అభివృద్ధితో పాటు ఆలంపూర్ ప్రాంత సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. అమృత్ భారత్ పథకం కింద రూ.6.07 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న జోగులాంబ రైల్వే స్టేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సమాచార బోర్డులను తిలకించి, 'ఒక స్టేషన్ - ఒక ఉత్పత్తి' స్టాల్‌ను సందర్శించారు. అనంతరం టికెట్ కౌంటర్ వద్ద ప్రయాణికులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

విలేకరులతో మాట్లాడిన కిషన్ రెడ్డి, జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం కేంద్ర పర్యాటక శాఖ ఇప్పటికే రూ.37 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆలయాల సంరక్షణ, అంతర్గత అభివృద్ధి పనులను కేంద్ర సాంస్కృతిక శాఖ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలంపూర్‌ను దేశవ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. ఆలంపూర్ అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేసినప్పటికీ బస్ స్టాండ్, వంతెనలు, రహదారులు వంటి కొన్ని కీలక మౌలిక వసతుల పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని ఆ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను సమగ్రంగా సమీక్షించి, జాప్యం లేకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి కూడా జోగులాంబ అమ్మవారి దర్శనానికి భక్తులు వస్తున్న నేపథ్యంలో మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని రహదారులు, పార్కింగ్ సదుపాయాలు, తాగునీటి వసతి, పారిశుధ్యం, ప్రజా రవాణా వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని సూచించారు. ఆలంపూర్‌ను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడంపై కేంద్రం దృష్టి సారించిందన్నారు. తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 42 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని, 2027 నాటికి ఈ పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. జోగులాంబ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు ఇప్పటికే 95 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం ఆధ్యాత్మిక వైభవం ప్రతిబింబించేలా రైల్వే స్టేషన్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే భక్తులతో పాటు ఆలంపూర్ పరిసర ప్రాంతాల ప్రజలకు హైదరాబాద్, కర్నూలు తదితర ప్రాంతాలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా సింగిల్ లైన్లను డబుల్ లైన్లుగా, డబుల్ లైన్లను ట్రిపుల్ లైన్లుగా, అవసరమైన చోట నాలుగు లైన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ డీఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జర్మన్ పరిశ్రమలతో భాగస్వామ్యానికి తెలంగాణ కృషి

**హైదరాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణలో జర్మన్ పెట్టుబడులు, సాంకేతికతను మరింతగా ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్ (జీబీఏ) ప్రతినిధి బృందంతో సోమవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక భాగస్వామ్యంపై విస్తృతంగా చర్చించారు. జీబీఏ ప్రతినిధి బృందానికి జర్మనీలోని కెల్‌స్టర్‌బాచ్ మేయర్ మాన్‌ఫ్రెడ్ ఒకెల్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో సెమీకండక్టర్లు, అధునాతన తయారీ, ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ రంగాల్లో ఉన్న అవకాశాలను మంత్రి ప్రతినిధి బృందానికి వివరించారు.

తెలంగాణ పరిశ్రమలకు జర్మనీతో మరింత బలమైన వాణిజ్య సంబంధాలు ఏర్పడేలా తెలంగాణ-జర్మనీ లాజిస్టిక్స్ కారిడార్ ఏర్పాటు అవకాశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ కారిడార్ ద్వారా తెలంగాణ ఎగుమతిదారులు జర్మనీతో పాటు యూరప్ మార్కెట్లకు సులభంగా చేరుకునే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక వాతావరణం, ఆధునిక మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని శ్రీధర్ బాబు వివరించారు. జర్మన్ కంపెనీలు తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా ఎంచుకునేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

జర్మన్ సాంకేతికత, పెట్టుబడులు, తయారీ రంగాలను తెలంగాణకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. పరస్పర సహకారంతో పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని అభిప్రాయపడ్డారు. సమావేశంలో తెలంగాణ మరియు జర్మన్ పరిశ్రమల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, భవిష్యత్ పెట్టుబడి అవకాశాలను అన్వేషించడం, సాంకేతిక సహకారాన్ని విస్తరించడం వంటి అంశాలపై సానుకూల చర్చలు జరిగినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# దళిత నాయకుడిని కించపరిచేలా వ్యవహరించారని బిజెపి నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు

- **ఖర్గేను కించపరిచేలా శుద్ధీకరణ చేయడంపై కాంగ్రెస్ ఎస్సి సెల్ నాయకుల ఆగ్రహం**

**గీసుకొండ, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, సీనియర్ దళిత నాయకులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ ప్రాంగణంలో శుద్ధీకరణ పేరుతో హవన్ నిర్వహించడాన్ని నిరసిస్తూ, ఉత్తరాఖండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మహేంద్ర భట్పై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ గీసుకొండ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ముల వినయ్ ఆధ్వర్యంలో గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో పిటిషన్ సమర్పించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ కాయిత బిక్షపతి హాజరై మాట్లాడుతూ.. ఆగస్టు 8న హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో మల్లికార్జున ఖర్గే బహిరంగ సభలో పాల్గొన్నారని, అనంతరం ఆగస్టు 10న అదే ప్రదేశంలో శుద్ధీకరణ పేరుతో హవన్/యజ్ఞం నిర్వహించినట్లు వార్తా నివేదికల్లో వెల్లడైందని తెలిపారు. ఖర్గే దళిత నాయకుడు కావడంతో ఆయన పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేశారనే భావన కలిగించేలా ఈ ఘటన చోటుచేసుకుందని, ఇది దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యగా తాము భావిస్తున్నామని అన్నారు. అంతేకాకుండా ఈ శుద్ధీకరణను ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ సమర్థిస్తూ వ్యాఖ్యలు చేసినట్లు వార్తలు వెలువడ్డాయని, అందువల్ల ఆయనపై కూడా సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ-ఎస్టీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కాయిత బిక్షపతి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీసుకొండ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ముల వినయ్, వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ గొర్రె రాజు, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీలు దక్క కిరణ్ కుమార్, నాగారపు సుధాకర్, కాంగ్రెస్ కార్యకర్త దక్క రాజు తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 16న సీఎంకు కృతజ్ఞత సభ

- **-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓయూలో పాలాభిషేకం**
- **డాక్టర్ పిడమర్తి రవి**

**హైదరాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గుర్తింపు కార్డు, బస్సు పాస్ కల్పిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సెప్టెంబర్ 16న కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. సోమవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం దక్కలేదని అన్నారు.

ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కే.కే. కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గుర్తింపు కార్డు, బస్సు పాస్ అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపేందుకు సెప్టెంబర్ 16న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. రహీం, కన్వీనర్ చందర్ నాయక్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, గడ్డ యాదయ్య, కందుల శ్రీను, అందే కృష్ణ, అంజి, నక్క మహేష్, దర్శనం జాన్, మొగిలిగిద్ద ప్రసాద్, దేవరకొండ నరేష్, కల్వకుర్తి శ్రీశైలం, మీసాల మహేష్, టి. ప్రశాంత్, శ్రీనివాస్, బొమ్మరిల్లు స్టాలిన్, శివ తదితరులు పాల్గొన్నారు.



# మంకమ్మతోటలో సీసీ రోడ్డు, మురుగు కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన

- **45వ డివిజన్ అభివృద్ధికి రూ.70 లక్షల నిధులు**

**కరీంనగర్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 45వ డివిజన్ మంకమ్మతోటలోని ఎమ్మెల్సీ గోపాల్ రావు భవనం సమీపంలో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధులతో రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు, మురుగు కాలువ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మురుగు కాలువల సౌకర్యం కల్పించేందుకు అవసరమైన నిధులు సమకూర్చి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ-శ్రీనివాస్, ఇతర కార్పొరేటర్లు, సహఎంపిక సభ్యుడు కన్న కృష్ణ, బీజేపీ నాయకులు గడప నాగరాజు, కోడిక్యాల సురేష్, అక్షయ్, నగరపాలక సంస్థ అధికారులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన రేషన్ కార్డుల పంపిణీ చేసిన సర్పంచ్ బిల్లా యాదగిరి

**వేలేరు, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలేరు గ్రామంలో మొత్తం 2,152 రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

దేశంలోనే సన్నబియ్యం అందిస్తున్న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో గ్రామంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. ప్రజల సంక్షేమం, గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు సంధ్య, ప్రవళిక, పర్వీన్, చైతన్య, రణధీర్ రెడ్డి, జావిద్ పాషా, సురేష్, సునీల్, ప్రభుత్వ అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# బ్రతికుండగానే రికార్డుల్లో మృతి!

- **పింఛన్ జాబితాలో చనిపోయినట్లు నమోదు..**
- **పింఛన్ అందక వృద్ధుడి అవస్థలు**

**కరీంనగర్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**



బ్రతికుండగానే అధికారిక రికార్డుల్లో మృతి చెందినట్లు నమోదు కావడంతో ఓ వృద్ధుడు పింఛన్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. చొప్పదండి మండలం గుంపూర్‌కు చెందిన 65 ఏళ్ల వృద్ధుడికి తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పింఛన్ నిలిచిపోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
వృద్ధుడికి రేషన్ మాత్రం అందుతున్నప్పటికీ, పింఛన్ జాబితాలో మాత్రం మృతి చెందిన వ్యక్తిగా నమోదు చేసినట్లు ఆయన కుమారుడు కరుణాకర్ రెడ్డి తెలిపారు. దీంతో గత కొంతకాలంగా పింఛన్ అందక కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు.
బ్రతికున్న వ్యక్తిని మృతి చెందినట్లు అధికారిక రికార్డుల్లో నమోదు చేయడంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రికార్డుల్లోని తప్పులను సరిచేసి పింఛన్‌ను పునరుద్ధరించాలని బాధిత కుటుంబం కోరింది.అలాగే ఈ తప్పిదానికి కారణమైన అధికారులపై విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# మూసీపై ముసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి ప్రారంభం

- **రూ.52 కోట్లతో నిర్మాణం పూర్తి**
- **అంబర్‌పేట–దిల్‌సుఖ్‌నగర్ రాకపోకలకు ఊరట**
- **అభివృద్ధి పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**





హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు మూసీ నదిపై అంబర్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో నిర్మించిన ముసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వంతెనను ప్రారంభించిన అనంతరం దాని నిర్మాణ విశేషాలను పరిశీలించారు. రూ.52 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ హై లెవల్ బ్రిడ్జి మొత్తం 400 మీటర్ల పొడవుతో నిర్మించబడింది. వంతెన అందుబాటులోకి రావడంతో అంబర్‌పేట, ముసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా రోజువారీ ప్రయాణికులకు ట్రాఫిక్ రద్దీ నుంచి ఉపశమనం లభించనుంది.
ప్రారంభోత్సవం సందర్భంగా అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. వంతెన నిర్మాణానికి సంబంధించిన వివిధ దశలను, సాంకేతిక అంశాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. నగర మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు వివరించారు.
ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వీ. హనుమంతరావు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీగణేష్, నవీన్ యాదవ్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు.
నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. కొత్త వంతెనతో మూసీ నది ఇరువైపుల ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ముసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి ప్రారంభంతో నగర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఇది మరో నిదర్శనంగా నిలిచిందని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు.



# తీజ్ పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలి

- **తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు బానోతు వెంకట్ నాయక్ డిమాండ్**
- **అంబరాన్నంటిన తీజ్ సంబరాలు**

**గూడూరు, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**

తీజ్ పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, ప్రతి ఏటా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు బానోతు వెంకట్ నాయక్ డిమాండ్ చేశారు.
సోమవారం గూడూరు మండల కేంద్రంలో తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బానోతు వెంకట్ నాయక్ మాట్లాడుతూ.. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.
బంజారా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా తీజ్ ఉత్సవాలను ప్రతి ఏటా అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని ఆయన కోరారు. తీజ్ పండుగకు ప్రభుత్వం గుర్తింపు కల్పించి, బంజారా సమాజం ఆచార సంప్రదాయాలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.
అనంతరం పెళ్లికాని బంజారా యువతులు గోధుమలతో నింపిన బుట్టలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంచంపై చేర్చారు. బంజారాల ఆరాధ్య దైవాలైన మేరామా యాడి, సంత్ సేవాలాల్, సీత్లా భవాని చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
డప్పుల దరువులకు అనుగుణంగా బంజారా యువతులు, మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. దీంతో తీజ్ వేడుకలు అంబరాన్నంటాయి. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు స్థానికులను ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమంలో తీజ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు గురు శ్రీ వాల్యానంద స్వామి, వాంకుడోతు భరత్ నాయక్, వి. స్వామి, మంగీలాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా 'సిలుకు సిలుకు చీరలు' సాంగ్ ఈవెంట్

- **ముఖ్యఅతిథిగా హాజరై సాంగ్ లాంచ్ చేసిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి**

**క్యాతంపల్లి, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**








ధర్మసాగర్ మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో 'సిలుకు సిలుకు చీరలు' ఫోక్ సాంగ్ లాంచ్ ఈవెంట్ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఖాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సాంగ్‌ను లాంచ్ చేశారు.
ఈ సందర్భంగా సాంగ్ నిర్వాహకులు, కళాకారులు ఏసీపీ ప్రశాంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాంగ్‌ను విడుదల చేసి చిత్ర బృందాన్ని అభినందించారు.
సాంగ్ లాంచ్ అనంతరం ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ 'సిలుకు సిలుకు చీరలు' ఫోక్ సాంగ్‌ను ఎంతో ఆసక్తితో, అందరి సహకారంతో రూపొందించామని తెలిపారు. తెలంగాణ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలకు అద్దం పట్టేలా పాటను రూపొందించినట్లు చెప్పారు. సాంగ్‌ను ఆదరించి విజయవంతం చేయాలని ప్రేక్షకులను కోరారు.
తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక చీఫ్ ఎడిటర్ బొల్లెపాక రాజేష్ మాట్లాడుతూ 'సిలుకు సిలుకు చీరలు' పాట అద్భుతంగా రూపొందించారని, జానపద కళలకు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఈ పాట ప్రతిబింబంగా నిలుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ప్రతిభ ఉన్న యువతకు ఇలాంటి వేదికలు మరింతగా అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు.
'సిలుకు సిలుకు చీరలు' పాటకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని, ఈ పాటలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ మంచి పేరు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి జానపద పాటలను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించవచ్చని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా సాంగ్ చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.
క్యాతంపల్లి గ్రామంలోనే పాట చిత్రీకరణ జరగడం, అదే ప్రాంతంలో సాంగ్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్,
ఉపసర్పంచ్,మాజీ ప్రజాప్రతినిధులు ,చిత్ర బృందం, స్థానిక ప్రజలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీఎంజేఎఫ్ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- **రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి సురేందర్ మాదిగ పిలుపు**

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**



"జనం కోసం.. జాతి కోసం.. జర్నలిస్టులు పనిచేయాలి" అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం (టీఎంజేఎఫ్) 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి సురేందర్ మాదిగ, రాష్ట్ర సహాయ కార్యదర్శి మ్యాథరి దాసు మాదిగ, నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ పి. వెంకటేష్ మాదిగ పిలుపునిచ్చారు.
సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో మాదిగ జర్నలిస్టులను కలిసి మహాసభల సన్నాహక ఏర్పాట్లపై వారు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 12న హైదరాబాద్ కోఠిలోని బీసీసీ భవన్‌లో నిర్వహించనున్న టీఎంజేఎఫ్ 3వ రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి మాదిగ జర్నలిస్టు మిత్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.
జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజ అభివృద్ధి, అణగారిన వర్గాల హక్కుల కోసం తమ వంతు పాత్ర పోషించాలని వారు అన్నారు. టీఎంజేఎఫ్ రాష్ట్ర మహాసభల్లో జర్నలిస్టుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో తెలకపల్లి టీఎంజేఎఫ్ మండల కన్వీనర్ రెడ్డపాకుల రమేష్ మాదిగ, రెడ్డపాకుల మల్లేష్ మాదిగ, సాంబశివుడు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా భాస్క రవీందర్ నూతన గృహ ప్రవేశ వేడుక

- **శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు**

**ధర్మసాగర్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**

ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామ కాంగ్రెస్ నాయకుడు భాస్క రవీందర్ నూతనంగా నిర్మించుకున్న గృహంలో గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గృహప్రవేశ వేడుకలు సంప్రదాయబద్ధంగా జరిగాయి.
కార్యక్రమానికి రాయగూడెం సర్పంచ్ కలకొల్ల మహేష్, తాటికాయల సర్పంచ్ సోమక్క చంద్రమౌళి హాజరై భాస్క రవీందర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కలిసి నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఇంటిలో భాస్క రవీందర్ కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంతమైన జీవితం గడపాలని వారు ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో వాంకుడోతు మొగిలి, కనుకటి యాదగిరి, బొల్లెపాక రాజేష్, బొల్లెపాక సంపత్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భాస్క రవీందర్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో తాటికాయల గ్రామంలో గృహప్రవేశ వేడుక సందడిగా సాగింది.

# శాసనమండలి కమిటీల ప్రారంభ సమావేశం

- **- నూతన కమిటీలకు చైర్మన్, స్పీకర్ శుభాకాంక్షలు**
- **- పలువురు సభ్యులతో తొలి సమావేశాలు**
- **- శాసన వ్యవహారాల సమర్థ నిర్వహణపై చర్చ**

**హైదరాబాద్, ఆగస్టు 31 (తెలంగాణ ముచ్చట్లు):**




తెలంగాణ శాసనమండలి కమిటీల ప్రారంభ సమావేశాలు సోమవారం శాసన పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్‌హాజరై నూతన కమిటీల కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. అంచనాల కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్ కోరం కనకయ్యతో పాటు సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, పి. రాకేశ్ రెడ్డి, యాదవ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ వ్యయాలు, ప్రణాళికల అమలుపై కమిటీ సమీక్షా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు.
వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీ సమావేశానికి చైర్మన్ హోదాలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, అనీల్ జాదవ్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన అంశాలపై కమిటీ కీలక పాత్ర పోషించనున్నట్లు పేర్కొన్నారు. సౌకర్యాల కమిటీ సమావేశంలో కూడా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చైర్మన్ హోదాలో పాల్గొన్నారు. సభ్యులు మేడిపల్లి సత్యం, యల్. రమణ, ప్రకాష్ గౌడ్, నెల్లికంటి సత్యం, బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. శాసనసభ, శాసనమండలి సభ్యులకు అవసరమైన సౌకర్యాల మెరుగుదలపై కమిటీ దృష్టి సారించనుంది.
ఈ సమావేశాలకు శాసన పరిషత్ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి హాజరయ్యారు. సమావేశాల ప్రారంభానికి ముందు నూతన కమిటీ చైర్మన్లు, సభ్యులకు పుష్పగుచ్చాలు అందజేసి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. శాసన కమిటీల ద్వారా ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.


Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in